క్లుప్తంగా

నేడు ఉచిత నేత్ర వైద్యశిబిరం

జలదంకి(కలిగిరి): జలదంకి ఉన్నత పాఠశాల ఆవరణలో చాగణం లలితమ్మ-భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్టీ మేనేజర్ చాగణం గౌరీశంకర్ శనివారం తెలిపారు. తిరుపతి శ్రీవెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో ఉచితంగా నేత్ర పరీక్షలు చేసి మందులు అందజేస్తారని చెప్పారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారికి తిరుపతిలోని ఆస్పత్రిలో చేస్తారని తెలిపారు. మండల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరికుంటపాడులో 144 సెక్షన్ అమలు

వరికుంటపాడు: వరికుంటపాడులో ఆదివారం ఉదయం నుంచి 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తహసీల్దార్ హేమంత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత రెండు మూడు నెలలుగా మైనింగ్‌కు సంబంధించిన నిరసనలు జరుగుతున్న నేపథ్యంలో బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ పర్యటిస్తుండడంతో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. గ్రామంలో ఐదుగురికి మించి గుమికూడడం, ఆయుధాలు తీసుకెళ్లడం, ప్రజాశాంతికి భంగం కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చిలకలమర్రి జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడి ప్రతిభ

సోమశిల: అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వం మిషన్ కర్మయోగిలో భాగంగా తీసుకొచ్చిన ఐగాట్ కర్మయోగిలో ప్రతిభకనబరిచారు. శనివారం నాటికి వేయి కోర్సులను పూర్తి చేశారు. ప్రతి ఉపాధ్యాయుడు 25 కోర్సులను పూర్తి చేయాల్సి ఉండగా వేయి కోర్సులను పూర్తిచేసిన చంద్రశేఖర్‌రెడ్డిని సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

పగలే వెన్నెల



వరికుంటపాడు: మండలంలోని వేంపాడు పంచాయతీ పరిధిలోని వెంగమాంబపురం, వేంపాడు, ఎస్సీ కాలనీలో వీధిదీపాలు నిరంతరాయంగా వెలుగుతున్నాయి. వీధి దీపాలను ఆర్పేందుకు స్విచ్‌లను ఏర్పాటు చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో వీధి దీపాలు త్వరగా కాలిపోతున్నాయి. మరోవైపు పంచాయతీపై విద్యుత్ బిల్లుల భారం పడుతోంది. పంచాయతీ పాలకవర్గం స్పందించి రాత్రి వేళల్లో మాత్రమే వీధిదీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలని పంచాయతీ ప్రజలు సర్వత్రా కోరుతున్నారు.

నిరుపయోగంగా ఆర్టీసీ బస్‌స్టేషన్



సీతారామపురం : మండల కేంద్రమైన సీతారామపురంలో ఆర్టీసీ బస్‌స్టేషన్ ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉంది. ఇక్కడ హడ్కో నిధులతో మండల కార్యాలయాల ఎదురుగా లక్షలాది రూపాయల వ్యయంతో బస్ స్టేషన్‌ను నిర్మించారు. అయితే బస్ స్టేషన్‌లోకి రాకుండా పాత బస్టాండ్ సెంటర్‌కే ఆర్టీసీ బస్సులు వెళుతున్నాయి. దీంతో ప్రయాణికులు కూడా పాతబస్టాండ్ సెంటర్‌లోనే బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. ఫలితంగా బస్ స్టేషన్ పూర్తిగా నిరుపయోగమైంది. ప్రస్తుతం అది సంచార జీవులకు నిలయంగా, ప్రైవేటు వాహనాలకు షెల్టర్‌గా మారింది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికార యంత్రాంగం స్పందించి ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నిర్లక్ష్యపు తుప్పు



వరికుంటపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వెనకవైపున గృహ నిర్మాణాలకు సంబంధించిన స్టీల్‌ను నిరుపయోగంగా పడేశారు. గత ప్రభుత్వం జగనన్న గృహ నిర్మాణ లబ్ధిదారుల కోసం స్టీల్‌ను సరఫరా చేసింది. అప్పట్లో కొంత మంది లబ్ధిదారులకు స్టీల్‌ను గృహ నిర్మాణశాఖ అధికారులు అందజేశారు. మిగిలిన స్టీల్‌ను పంపిణీ చేయకుండా నిర్లక్ష్యంగా పడేయడంతో ఏడాదిగా ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తుప్పు పడుతోంది.

కళ తెస్తూ.. కళను బతికిస్తూ..

- పూర్వవైభవంగా దిశగా కోలాటం
- పల్లెలతో పాటు పట్టణాల్లోనూ పెరుగుతున్న ఆదరణ
- నేర్చుకోవడంపై మక్కువ చూపుతున్న మహిళలు
- పండగలు, ఉత్సవాల్లో.. పెళ్లి వేడుకల్లో ప్రదర్శనలు



కోలాటాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతారామపురం : రెండు కర్రలు తాకడంతో శ్రావ్యంగా వినిపించే శబ్ధం...లయబద్ధంగా సాగే నృత్యం..వెరసి కోలాటం..ఈ సంప్రదాయ కళ ఇటీవల పల్లెలతో పాటు పట్టణాల్లో ఆదరణ పొందుతూ పూర్వవైభవం దిశగా అడుగులు వేస్తోంది. కోలాటం ఉంటే పండగలు, ఉత్సవాలు, తదితర ఆధ్మాత్మిక కార్యక్రమాలైనా..పెళ్లి తంతు అయినా.. ఎంతో ఆకర్షణీయంగా మారుతున్నాయి. పల్లెలు సంప్రదాయ కళలకు పుట్టినిల్లు. గతంలో పగటి వేళ పనులతో అలిసిపోయిన గ్రామీణులు రాత్రి వేళల్లో భజనలు ,కోలాల ప్రదర్శనలతో మానసికోల్లాసాన్ని పొందేవారు. నేటి ఆధునిక యుగంలో కాలక్రమేణా వచ్చే మార్పులతో సంప్రదాయ కళలు చాలావరకు అంతరించిపోతున్నాయి. ప్రజల్లోనూ ఎంతో మార్పు వచ్చింది. క్షణం తీరిక దొరికినా సెల్ ఫోన్‌లతో కాలక్షేపం చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో సంప్రదాయ కళ కోలాటంపై కొందరు మక్కువ చూపుతూ పూర్వవైభవాన్ని తీసుకొస్తున్నారు. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోని మహిళలు, చిన్నారులు, యువకులు కోలాటం నేర్చుకుంటున్నారు. తమ గ్రామాల్లో, ఇతర ప్రాంతాల్లో జరిగే ఉత్సవాల సందర్భంగా కోలాటాన్ని ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతం పండగలు, ఉత్సవాలతో కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది అంటే అతిశయోక్తి కాదనే చెప్పాలి. రఘుకుల తిలకా రారా.. నిన్నెత్తి ముద్దులాడెదరా... బుజ్జి బుజ్జి గణపయ్య... బొజ్జ గణపయ్య వంటి ఆధ్యాత్మిక పాటలు, కట్టమీద పోయే అలకల చిలక..భలే బాగుంది బాల.. బాగుందమ్మా బాగుందమ్మా వంటి సంప్రదాయ జానపద పాటలతో పాటు సినిమా పాటలకు సైతం కోలాట ప్రదర్శనలు చేస్తున్నారు. కోలాటానికి సంబంధించి అనేక పాటలు మనసుకు ఉల్లాసాన్ని ఇస్తున్నాయి. ఇక ఈ పాటలకు కళాకారులు ప్రదర్శించే నత్యం చూసేందుకు రెండు కళ్లు చాలవు అన్నట్లుగా ఉంటున్నాయి. కోలాటం పాటలు వింటూ కళాకారులు ప్రదర్శనలు ప్రజలను ఆనంద డోలికల్లో ముంచెత్తుతున్నాయి.

వయోభేదం లేకుండా..

ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లోని మహిళలు కోలాటం నేర్చుకుంటున్నారు. కోలాటం నేర్చుకునే వారిలో పిల్లలే కాక పెద్దలు కూడా ఉంటున్నారు. అలాగే గృహిణులతో పాటు ఉద్యోగాలు చేసేవారు ఉంటున్నారు. వయోభేదం..హోదాలు పక్కనపెట్టి కోలాట ప్రదర్శనలు చేయడాన్ని విశేషంగా చెప్పొచ్చు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు సైతం పండుగలు, ఉత్సవాలు, వేడుకల్లో కోలాట ప్రదర్శనలు చేసేందుకు వెళుతున్నారంటే కోలాటంపై మహిళలకు ఉన్న ఆసక్తిని తెలియజేస్తుంది. క్షణం తీరికలేని ఈ రోజుల్లో మహిళలు సమయం కేటాయించుకుని కోలాటం నేర్చుకుంటున్నారు. అలాగే పండుగలు, ఉత్సవాల సందర్భంగా నిత్యం ప్రత్యేకంగా సాధన చేయుటను విశేషంగా చెప్పొచ్చు.

వివాహ వేడుకల్లోనూ..

ప్రస్తుతం వివాహ వేడుకల్లో కూడా కోలాటం స్టేటస్ సింబల్‌గా మారింది. పెద్దపెద్ద హోదాల్లో ఉన్న వారు వివాహాల్లో కోలాట ప్రదర్శన ద్వారా వధూవరులను వేదికపై ఆహ్వానిస్తున్నారు. ఇందుకోసం వేలాది రూపాయలు ఖర్చు చేసి ప్రత్యేకంగా కళాకారులతో కోలాట ప్రదర్శన చేయిస్తున్నారు. మరికొంత మంది వధూవరులకు సంబంధించిన బంధువులే కోలాటం వేస్తూ వధూవరులకు వెల్కమ్ చెబుతున్నారు. ఒకే డ్రెస్‌కోడ్ తో మహిళలు కోలాటం చేస్తున్నారు. డ్రెస్‌కోడ్ ఎంపికపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుండడం కోలాటంపై మహిళలకు ఉన్న మక్కువను తెలియజేస్తోంది.

సంతోషంగా ఉంటుంది



మా గ్రామంలో మహిళలందరూ కోలాటం వేస్తారు. వారిని చూసి కోలాటంపై ఆసక్తితో నేర్చుకున్నా. దసరా పండగకు నెల రోజుల ముందు నుంచి మేము కోలాటం సాధన చేస్తాం. పండగ రోజు, ఊరేగింపు రోజు మేము దారి పొడవునా కోలాటం వేస్తాం. ఉత్సవాలు, తిరునాళ్ల, పండగల సందర్భంగా ఇతర ప్రాంతాలకు సైతం వెళ్లి కోలాట ప్రదర్శన చేస్తుంటాం.

–భానుప్రియ, విద్యార్థిని, పుల్లాయపల్లి, ఉదయగిరి మండలం

పూర్వజన్మ సుకృతం



ఉత్సవాల్లో కోలాటం వేసే భాగ్యాన్ని పూర్వజన్మ సుకృతంగా భావిస్తాను. కోలాటంతో ఆధ్యాత్మిక చింతనకు దగ్గరగా ఉండే అవకాశం లభిస్తుంది. ఇది మాటల్లో వర్ణించలేనిది. కోలాటంతో ఐక్యత భావం కలుగుతుంది. మహిళలు సంప్రదాయ జానపద కళలపై ఆసక్తి పెంపొందించుకోవాలి.

– బుజ్జమ్మ, గృహిణి, బెస్త కాలనీ, సీతారామపురం

మక్కువతో నేర్చుకున్నా



నాకు కోలాటం అంటే చాలా ఇష్టం. దానిపై ఉన్న మక్కువతో కష్టపడి నేర్చుకున్నా. ఎక్కడ కోలాటం వేయాలన్న వెళ్లిపోతా. కోలాటం పాటలు మనసుకు ఎంతో ఉల్లాసాన్ని కలిగిస్తాయి. యువత సంప్రదాయ కళలకు జీవం పోయాలి.

–కప్పు పృథ్వీ, రాజుగారి కాలనీ, సీతారామపురం

దేవుడిచ్చిన అవకాశం



కోలాటం నేర్పడం భగవంతుడు కల్పించిన అవకాశంగా భావిస్తున్నా. చిన్నారులు, యువకులు, మహిళలకు కోలాటం నేర్పుతున్నా. నాకన్నా పెద్దవారు సైతం నన్ను గురువుగా భావించి గౌరవిస్తారు. ఇది నాకు వెలకట్టలేని ఆనందాన్ని ఇస్తుంది. అంతరించిపోతున్న సంప్రదాయ కళలకు తిరిగి జీవం పోయాలన్నదే నా అభిమతం.

– పవన్‌కళ్యాణ్, కోలాటం గురువు, బెస్త కాలనీ, సీతారామపురం.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.330

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శనివారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.330 పలికింది. వేలానికి 839 బేళ్లు రాగా, అందులో 586 బేళ్లను విక్రయించారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.330, కనిష్టంగా రూ.100, సగటున రూ.226.60 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలంలో తొమ్మిది కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

కలిగిరిలో 445 పొగాకు బేళ్ల విక్రయం

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం 445 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 585 బేళ్లను తీసుకురాగా, 445 బేళ్లను కొనుగోలు చేసినట్లుగా చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ. 320, కనిష్టంగా రూ.110, సగటున రూ.234.02 ధర పలికిందని వివరించారు.

బాలికల గురుకులంలో ప్రత్యేక వైద్యశిబిరం

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు జ్వరాలు సోకిన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు రెండ్రోజుల పాటు ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌ఓ సుజాత ఆదివారం తెలిపారు. విద్యార్థులకు వైద్యసేవలందించేందుకు 11 మంది ఏఎన్ఎంలు, 10 గ్రేడ్–2 ఆశాకార్యకర్తలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆత్మకూరు అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యురాలు ఎస్‌కే అస్మా ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరం కొనసాగుతుందని తెలిపారు.

సాగునీటి సంఘం డైరెక్టర్ గున్నం మృతి

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు సాగునీటి సంఘం డైరెక్టర్ గున్నం నరసింహారెడ్డి అనారోగ్యంతో బుధవారం మధ్యాహ్నం మృతి చెందారు. స్వగ్రామమైన నువ్వూరుపాడులో ఆదివారం ఉదయం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

సభలు, సమావేశాలకు అనుమతుల్లేవు

ఉదయగిరి: ఉదయగిరి పోలీస్ సర్కిల్ పరిధిలోని సీతారామపురం, దుత్తలూరు, ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లో పోలీసు సెక్షన్ 30 అమల్లో ఉన్నందున సభలు, సమావేశాలు, పరామర్శలకు ఎలాంటి అనుమతులు లేవని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ వెంకట్రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల సర్కిల్ పరిధిలోని వరికుంటపాడు మండలం భాస్కరపురం, కనియంపాడు, జంగారెడ్డిపల్లె గ్రామాల్లో మైనింగ్ అనుమతుల నేపథ్యంలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తాయని చెప్పారు. అలాగే ఉదయగిరి మండలం అప్పసముద్రంలో గణేశ్ నిమజ్జనోత్సం సందర్భంగా బాణసంచా పేలి 9 మంది చిన్నారులు గాయపడ్డారని తెలిపారు. ఈ ఘటనలను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టామన్నారు. ఆయా గ్రామాల్లో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కావలివాసికి ప్రజాసేవారత్న పురస్కారం



కావలి(అల్లూరు): కావలికి చెందిన అన్నదాత సేవా ట్రస్ట్ నిర్వాహకుడు, మధు వృద్ధాశ్రమ నిర్వాహకుడు దామా మధుసూదన్‌రావు ప్రజాసేవారత్న పురస్కారం అందుకున్నారు. చిలకలూరిపేట కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు జయజయసాయి ట్రస్ట్ చైర్మన్ పూసపాటి బాలాజీ చేతుల మీదుగా మధుసూదన్‌రావుకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రావు మాట్లాడుతూ తనకు సేవారత్న పురస్కారం లభించడంపై హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నో అవార్డులు వచ్చినా తాను వృద్ధాశ్రమాన్ని స్థాపించిన తరువాత తీసుకున్న ఈ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని, వృద్ధాశ్రమంలోని వారికి మరింత సేవ చేస్తూ ఎక్కువ మంది అభాగ్యులకు ఆశ్రయం కల్పిస్తామన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి బీటీఏ కృషి



ఉదయగిరి: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి బహుజన టీచర్స్ అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తుందని బీటీఏ వ్యవస్థాపకుడు నూకలపాటి రమణయ్య అన్నారు. స్థానిక ఏబీఎం కాంపౌండ్ ఆవరణలో బీటీఏ ప్రాంతీయ సదస్సును జ్యోతి శ్రీనివాసులు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ ఉదయగిరి ప్రాంతంలో బీటీఏను బలోపేతం చేసి ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రాంతీయ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు వెంటనే పీఆర్సీని ప్రకటించాలని, 30 శాతం ఐఆర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జీఓ 77ను రద్దుచేసి ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళలకు న్యాయం చేయాలన్నారు. రాష్ట్ర, జిల్లా నాయకులు మోహన్‌రావు, వేణుగోపాల్, ఆదినారాయణ, మాల్యాద్రి, మణి సుబ్బు, ప్రసాద్, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, ఓబులేసు, చక్రపాణి, నరసింహులు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఆత్మకూరురూరల్: చెర్లోయడవల్లిలో ప్రవాస భారతీయ వైద్యురాలు ప్రమీల మదమాల పర్యవేక్షణలో మాజీ సర్పంచ్ కేతా విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని శనివారం నిర్వహించారు. 158 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏఎన్ఎంలు శంషాద్ బేగం, రాజేశ్వరి, ఆశావర్కర్లు కాంతమ్మ, ఆదిలక్ష్మమ్మ, రామిరెడ్డి అశోక్, కోలా హజరత్, పెంచలయ్య, అంబటి రాధాకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

• నేత్రపర్వంగా కల్యాణోత్సవం



సీతారామపురంలోని అమ్మవారిశాల వీధిలో సిద్ధిబుద్ధి వరసిద్ధి వినాయకస్వామి కల్యాణ మహోత్సవాన్ని వాసవి గణేష్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం వినాయకుడికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, రాత్రి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు.

–సీతారామపురం

దత్తత కుటుంబాలకు చేయూత

కావలి (అల్లూరు) : పట్టణంలోని తుఫాన్‌నగర్‌లోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో దత్తత కుటుంబాలకు నిత్యావసర సరుకులను శనివారం పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన పలువురు వైద్యులు సంయుక్త సేవా సంస్థ ద్వారా పేద కుటుంబాలను దత్తత తీసుకున్నారు. దత్తత కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యాన్ని దాతలు అందజేశారు. అలాగే పేద కుటుంబాల్లోని పిల్లల పేరు మీద ప్రతి నెలా పోస్టాఫీసు నందు జమ చేస్తున్న నగదు పుస్తకాలను అందజేశారు. వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, సభ్యులు ఎంవీఎస్ ప్రసాద్‌రావు, ఖాదర్‌బాషా, నేలటూరి శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.


కోన కాలువ శుభ్రం



తొట్టెను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ఉదయగిరి: పట్టణ వాసులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించే కోనకాలువ, నీటి తొట్టిని సర్పంచ్ పీ సామ్రాజ్యం, ఉపసర్పంచ్ ముర్తుజాహుస్సేన్, డిప్యూటీ ఎంపీడీఓ కరిముల్లా ఆదేశాల మేరకు పంచాయతీ పారిశుధ్య కార్మికులు శనివారం శుభ్రపరిచారు. దుర్గంపై ఉన్న నీటి తొట్టిలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. దుర్గంపై నుంచి పట్టణ సమీపంలోని దర్గా వరకు ఉన్న కోన కాలువలో నీటి ప్రవాహానికి అడ్డుపడిన ఆకులు, ఇతర వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు.

డ్రైనేజీ నిర్మించారు.. మూతేయడం మరిచారు



సీతారామపురం : మండలంలోని బోడసిద్దాయపల్లి ఎస్సీ కాలనీ వద్ద 167బీజీ జాతీయ రహదారికి ఇరువైపులా నిర్మించిన డ్రైనేజీలపై మూత వేయకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ ఎస్టీకాలనీ వద్ద కొద్దిదూరం సిమెంట్‌పలకలతో మూత వేయకుండా డ్రైనేజీని తెరిచి ఉంచారు. దీంతో డ్రైనేజీ నుంచి దుర్గంధం వెదజల్లుతూ స్థానికులు అనారోగ్యానికి గురవుతున్నారు. మరో వైపు చిన్నారులు, పశువులు డ్రైనేజీలో పడి గాయాలపాలవుతున్నారు. ఏడాదిగా డ్రైనేజీపై మూతవేయాలని విజ్ఞప్తి చేస్తున్నా తాము గిరిజనులమని కాంట్రాక్టర్ అలసత్వం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి డ్రైనేజీలపై సిమెంట్ పలకలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

లోక్‌అదాలత్‌లో కేసులు సత్వరమే పరిష్కారం



ఆత్మకూరు కోర్టు ప్రాంగణంలో కేసులను పరిష్కరిస్తున్న జడ్జి గీతావాణి



కావలి: మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి

కావలి (అల్లూరు): కక్షిదారులు రాజీపడి వస్తే లోక్ అదాలత్‌లో కేసులను సత్వరమే పరిష్కరించడం జరుగుతుందని లోక్ అదాలత్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఏ గీతావాణి అన్నారు. కావలిలో లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో మెగా లోక్‌అదాలత్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి గీతావాణి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులను పరిష్కరించుకుంటే ఖర్చు, సమయం ఆదా అవుతుందన్నారు. లోక్ అదాలత్ ద్వారా బడుగు, బలహీన వర్గాల వారు ఉచిత న్యాయ సాయం పొందవచ్చని తెలిపారు. అనంతరం జూనియర్ సివిల్ జడ్జి ఈ సుధాకర్‌తో కలిసి 105 సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, బ్యాంకు కేసులను పరిష్కరించారు. వాటికి సంబంధించి రూ.43,34,500 నగదును బాధితులకు అందించారు. మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు కే చక్రపాణి, కార్యదర్శి రుషికుమార్, మెంబర్లు సాయిప్రసాద్, శ్రీదేవి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరులో 71 కేసులు పరిష్కారం

ఆత్మకూరు: కక్షిదారులు రాజీపడి వస్తే లోక్‌అదాలత్‌లో కేసులను సత్వరమే పరిష్కరించడం జరుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి బీ గాయత్రి తెలిపారు. ఆత్మకూరు కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని, నగదును వృథా చేసుకోకుండా లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం కేసులను పరిష్కరించారు. కాగా లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు 18, క్రిమినల్ కేసులు 45, బ్యాంకు కేసులు 8 కలిపి మొత్తం 71 కేసులను పరిష్కరించినట్లు జడ్జి తెలిపారు. ఈ కేసులకు సంబంధించి రూ.31,60,556 రికవరీ చేసి బాధితులకు అందించినట్లుగా వివరించారు. జూనియర్ సివిల్ జడ్జి ఎల్ జగదీష్‌కుమార్, లోక్ అదాలత్ సభ్యులు ఏ తిరుపతమ్మ, కే కిరణ్‌కుమార్, న్యాయవాదులు, ఎస్సైలు, పోలీసులు పాల్గొన్నారు.

పెన్నా తీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు సూచనలు ఇస్తున్న పోలీసులు

సంగం: సోమశిల జలాశయం నుంచి ఆదివారం క్రస్ట్ గేట్ల ద్వారా వరద నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో పెన్నా పరీవాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంగం పోలీసులు సూచించారు. మండలంలోని అన్నారెడ్డిపాళెం పల్లిపాళెం, దువ్వూరు పల్లిపాళెం, సంగం పల్లిపాళెం గ్రామాల్లో శనివారం పోలీసులు పర్యటించారు. ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం సంగం బ్యారేజ్ నుంచి మూడు గేట్ల ద్వారా నీరు విడుదల చేస్తున్నారని తెలిపారు. సోమశిల నుంచి నీటిని విడుదల చేస్తే పెన్నా నదిలో ప్రవాహం ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. పశువులు, గొర్రెల కాపర్లు, వ్యవసాయ పనులు చేసుకునే వారు పెన్నా నదిలోకి వెళ్లొద్దని సూచించారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే వెంటనే సంగం ఎస్సై 94407 96331, సంగం సీఐ 9154305605 లేదా 112 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

ప్రజలను అప్రమత్తం చేయండి

సోమశిల జలాయం నుంచి నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో పెన్నా తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని పంచాయతీకార్యదర్శులకు సంగం ఎంపీడీఓ సూచించారు. వీర్లగుడిపాడు, కోలగట్ల, పడమటిపాళెం, జెండాదిబ్బ, అన్నారెడ్డిపాళెం, సిద్దీపురం, మక్తాపురం, వెంకటరెడ్డిపాళెం గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

గుంతలమయంగా రోడ్డు



సీతారామపురం : మండలంలోని సింగారెడ్డిపల్లిలో ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా తయారైంది. ప్రధానంగా పంచాయతీ కార్యాలయం, మౌలాలి దర్గా వద్ద భారీ గుంతలు ఏర్పడడంతో వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు అవస్థ పడుతున్నారు. మౌలాలి దర్గా వద్ద డ్రైనేజీ నీరు ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతల్లో చేరి వాహనాలు వెళ్లే క్రమంలో భక్తుల మీద ఎగిరి పడుతుండడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. హైవే నిర్మాణంతో ఉదయగిరి–సీతారామపురం ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులను చేపట్టకుండా అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ఈ పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు గుంతలకు మరమ్మతులు చేపట్టాలని, పంచాయతీ పాలకవర్గం స్పందించి డ్రైనేజీల్లోని నీరు రోడ్డుపై ప్రవహించకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.